## సంగీతానికి ఇంత శక్తి ఉందా ?

నాకు తెలియకుండా నా వళ్ళంతా ఉత్సాహమూ, మనసంతా ఉత్తేజంతో నిండిపోయింది. విసుగ్గా, అలసటగా వుండి ఆఫీసుకి సెలవు పెట్టి పడుకున్న వాణ్ణి, తీరా ఇప్పుడు లేచి హుషారుగా ఏమైనా చేసెయ్యాలనిపించేలా నన్ను మార్చేసిన ఈ సంగీతం!!

అసలు దీన్ని సంగీతమంటారా ?

దాదాపు పది నిమిషాలనుంచి వినిపిస్తోంది– "హార్మోనికా" మీంచి తెరలు తెరలుగా. ఏదో చాలా పాత సినిమా పాట అయి వుండాలి. ఆ పాట ఏమిటో గుర్తురావడం లేదు. ఇలా మొదటిసారి కాదు హార్మోనికా మీంచి ఆ పాట వినడం. ఇప్పటికి నాలుగయిదు సార్లనించి నన్ను మోహపెడుతుంది ఆ స్వరం.

లేచి వెళ్ళాను ఆగలేక. తలుపులు దగ్గిరగా వేసి ఉన్నాయి. కిటికీ రెక్క తీసే ఉంది. అతను నలిగిన పక్కమీద పడుకుని ఉన్నాడు. చూపులు ఎక్కడో ఉన్నాయి. అప్రయత్నంగా పెదవులమీద ఆ ఇనుస్ట్రుమెంట్ కదులుతోంది అద్భుతమైన రాగాలను సృజిస్తూ.

పిలిచాను. అతని చూపుల్లో సంగీతపు తాదాత్మ్యత కనిపించలేదు నాకు. అందుకే పిలిచాను.

"అరె! మీరా!" లేచి గబుక్కున తలుపు తీశాడు. తీసి "వచ్చి కూచోండి మాస్టారూ! ఈ రోజు ఇంట్లోనే ఉన్నారా" అంటూ.

"అవునండి కొంచెం నలతగా ఉండి సెలవుపెట్టాను. కాని ఇప్పుడు చాలా ఫ్రెష్‌గా అయిపోయాను. అది చెప్పాలనే వచ్చాను" అని అతడి చేయి పట్టుకుని "ఎంత బాగా వాయించేరండీ" అన్నాను.

చిన్న నవ్వు నవ్వాడు. "నా గాలిపాట మీకు అంత నచ్చిందా ?"

"అవునండీ నిజంగా గాలిపాటే. మీరు ఊపిరి పోసి సృష్టించిన ఆ రాగాలు నాకు కొత్త ఊపిరినిస్తూంటాయి. ఇలా ఇది మొదటిసారి కాదు "

అతను చిన్నగా మొహమాటపడ్డాడు. మౌనంగా ఉండిపోయాడు. రెండు నిమిషాల తర్వాత పక్కమీదున్న హార్మోనికా తీసి సన్నగా వాయించడం మొదలుపెట్టాడు. అది అలవోకగా పలకడంలేదు. అతని ప్రయత్నంలోంచి పలుకుతుంది. ఇప్పుడు అతని ధ్యాస దానిని బాగా పలికించాలనే.


కాసేపు కూచుని లేద్దామనుకుంటూంటే వీధిగేట్ చప్పుడయింది. గేట్ తీసుకుని బేంక్ ప్యూన్ వస్తున్నాడు.

"ఏమిటోయ్ ఇలా వచ్చేవ్" అన్నాను.

గుండె కొంచెం దడదడలాడింది. నా ఊహ నిజమే.

"మీరు త్వరగా రావాలి. ఆవిడ ఓ పదినిముషాల క్రితం ఫిట్స్ వచ్చి పడిపోయారు."

నేను క్షణం ఆలస్యం చెయ్యలేదు. వెంటనే మా వాటాలోకి వెళ్ళి బీరువా తీశాను. లాకర్ తాళాల కోసం వెతికి లాకర్ తెరిచేసరికి రెండు నిమిషాలు పట్టింది. గబగబా డబ్బుతీసి జేబులో పెట్టుకుంటూ చూశాను. ఆ బాక్స్‌లో చాలా రోజులుగా నేను చూస్తున్న పేక్ చేసిన కవరు ఊడిపోయిఉంది దాంట్లోంచి ఆగలేక పైకి ఎగురుతున్నట్లున్న 'స్ప్రింగ్స్'.



ఫొటో: శ్రీనగేష్, తెనాలి

ఓ నిముషం ఏమీ అర్థం కాలేదు మరు నిముషంలో స్పష్టంగా అర్థమైపోయింది.

కామ్‌గా తాళాలు వేసేసి బయల్దేరాను.

* * *

చెల్లి బేంక్‌లో వర్క్ చేస్తోంది. చాలా తెలివయినదని చెప్పడానికి సాక్ష్యం—అది పందొమ్మిదో ఏటే బేంక్ టెస్ట్‌లో సెలక్ట్ అయింది. అప్పటి నుంచి ఆవిడ ఎంప్లాయీ. దాదాపు తొమ్మిదేళ్ళ నుంచి. ఇప్పుడు ఆఫీసర్.

నేను వెళ్ళే సరికి సోఫాలో పడుకుని వుంది వెళ్ళి తల దగర కూచుని తలని వళ్ళోకి తీసుకున్నాను. మెల్లిగా కళ్ళు తెరిచి చూసింది. తిరిగి కళ్ళు వాల్చేసుకుంది

కళ్ళ నించి పక్కలకి కారుతున్న నీళ్ళు.

"ఏమిటి చెల్లీ ! ఇది. ఛ ఊరుకో ఇప్పుడేమయిందని–" కసిరాను.

కసిరేను గాని ఇప్పుడేమయిందో— ఎందుకిలా అవుతుందో నాకు బాగా తెలుసు చదువుకున్న పిల్ల. ప్రపంచం చూస్తున్న పిల్ల దానికి మాత్రం తెలిసి ఉండదా?

"ఎందుకిలా అయిపోతున్నా నన్నయ్యా ? ఫిజికల్‌గా, మెంటల్‌గా ఇంత వీక్‌గా ఎందుకయిపోతున్నానో తెలీడం లేదు-" అంది.


ఎంతో ధైర్యమున్న పిల్ల. ఆ విషయం తనకి కూడా తెలుసు.

కాఫీ వచ్చింది. నేనే నెమ్మదిగా పట్టించి- పర్మిషన్ పెట్టించి- ఇంటికి తీసుకొచ్చేశాను.

* * *

రెండు రోజుల తర్వాత ఇంటికెళ్ళిపోతూ ఒక్కసారి చూసి పోదామని





# వెన్నెల కౌగిలి

వాడ్రేవు వీరలక్ష్మీదేవి

శివరాం రూం దగ్గర ఆగాను.

లోపల నుంచి గజ్జెల చప్పుడు. నా మనసులో చిన్న నవ్వుతో కూడిన బాధ. ....కొన్ని నెలలుగానేర్చుకుంటూన్న భరత నాట్యానికి ప్రాక్టీస్.... నన్ను చూసి మానేశాడు.

"రావోయ్! చాలా కాలానికి వచ్చేవు" అని ఆదరంగా తీసికెళ్ళి మంచం మీద కూచో పెట్టాడు. తనూ కూచుని గజ్జెలు విప్పేస్తూ- "ఎలా ఉన్నారు రాజీ" అనడిగాడు.

"అరె! విప్పేస్తావేం. నా ఎదురుగా చెయ్యవా? నేనూ చూడొద్దా?"

"ఈ విద్యలు నీకోసం కాదోయ్- వీటి పర్పస్ వేరు. డబ్బు పోసి ఇంత కష్టపడి నేర్చుకుంటున్నది పచ్చి మొగ వాసన కొడ్తున్న నీ కోసమా?" అని పకపకా నవ్వేడు

నాకు అతనితో వాదించడం ఇష్టంలేదు.

వెయ్యి రూపాయల జీతంతో ఉద్యోగం చేస్తున్నాడు. పెళ్ళి చేసుకుంటే సుఖవంతమైన జీవితానికి ఆ డబ్బు చాలదు. సరదాలు బోలెడు. అమ్మాయిల స్నేహం కావాలి. సంగీత పాటగాడు, డాన్సర్, కవి ఇలాంటి ఆర్టిస్టులంటే అమ్మాయిలకు క్రేజ్.

శివరాంకి పెళ్ళి ప్రమేయం లేకుండా ప్రేమించే అమ్మాయిలు కావాలి.

నాకు అందుకే ఇతనితో వాదన ఇష్టం ఉండదు. జాలి, నవ్వు మనసులో నవ్వుకుంటాను.

వెళ్తావని లేచాను.

* * *

ఇంటికి వచ్చే సరికి రాజీ ఎప్పటిలా నాకోసం భోజనం చెయ్యకుండా చూస్తూ కూచుని ఉంది.

"ఎందుకమ్మా! ఇంతసేపు ఆగావు. అసలే ఒంట్లో బావుండట్లేదు కదా"—మందలింపుగా అన్నాను.

'నువు దగ్గర లేకుండా ఎప్పుడేనా తినగలనా?' అన్నట్టు నవ్వింది. నవ్వి లేచి లోపలికి వెళ్ళింది.

అన్నం తింటూంటేచెప్పింది "ఆయన- అదే- మూర్తి ఈ రోజు బైటకి వెళ్ళ లేదు. హోటల్ టిక్కెట్లు అయిపోయి ఉంటాయి. లోపలే ఉన్నారు."

"అరె-" అంటూ లేచి వెళ్ళి పక్కవాటా తలుపు తట్టాను.

తీరా తట్టాను కాని ఆయన తలుపు తీస్తే ఏమని మాట్లాడను? అనిపించింది. భోజనానికి వెళ్ళే ముందే పిలవాల్సింది. ఇప్పుడు సగం సగం తింటూ ఈ ఎంగిలి చేత్తో ఇలా ఎలా?


లోపల నుంచి ఇంకా ఏ రెస్పాన్సూ లేదు.

కామ్‌గా వచ్చేశాను.

"ఏం పలక లేదా?" చెల్లి అడిగింది.

"లేదమ్మా. ఇలా మధ్యలో పిలవడం బావుండదనిపించింది" చేసిన పొరపాటు





ఎలా సరిచేసుకోవాలో ఆలోచిస్తూ ఉండగా భోజనం అయింది.

నేను అరుగు మీద కుర్చీ వేశాను కూచుందామని- మూర్తి వీధి మెట్లమీద గోడకి జారబడి కూర్చున్నాడు. కాస్త వెన్నెల అతని కాళ్ళ మీద మాత్రం పడుతోంది. మిగతా భాగం అంతా చీకటి. ఒక గంటా. రెండు గంటలు అలాగే కూచుని ఉంటే అతను పూర్తిగా వెన్నెల్లో మునిగి పోతాడు.

కానీ! ఇంకా కొంతకాలం ఇలా ఉద్యోగం లేకుండా ఉంటే మాత్రం- అతను ఏమై పోతాడో?

కానీ నిజంగా ఇతని కాళ్ళ మీద వెన్నెల వాలే ఉంది నేనే చెప్పాలి చెప్పడానికయినా, అడగడానికయినా నా సంకోచాలు, భయాలు నాకున్నాయి.

అవీ ఈ మధ్యనే. ఆరు నెలల నించి.

*  *  *

ఆరు నెలల నించి చెల్లికి ఫిట్స్ వస్తున్నాయి. మొదటి సారి ఇలాగే బేంక్‌లో ఉండగానే వచ్చింది. ఆఫీసుకి ఫోన్ వస్తే పరిగెట్టుకెళ్ళాను.

ఒకటి రెండు సార్లు తర్వాత డాక్టరు అడిగారు.

"మీ చెల్లి మంచి జీతం తెస్తున్న ఎంప్లాయ్ కదా! ఇంకా పెళ్ళి చెయ్యలేదేం?"

మంచి జీతం తెచ్చుకుంటున్నా ఇంకా మంచి కట్నాలు పోస్తేనే కాని పెళ్ళిళ్ళు కావని ఆయనకి తెలీదా?

"చూస్తున్నాం" అని నసిగాను.

"చూడడం కాదు. త్వరలో చెయ్యడం మంచిది. ఆమెకు హిస్టీరియా ప్రారంభంలో ఉంది. ఆమె ఆరోగ్యం దృష్ట్యా పెళ్ళి అవసరం" డాక్టరుగారు మర్యాదగానే ఈ మాటలు చెప్తున్నారు. కానీ నాకు ఛెళ్ళున చెంపమీద కొడ్తూ చెప్పినట్టయింది.

నా చిన్ని రాజీకి పెళ్ళి ఆలస్యం చెయ్యడం వల్ల అనారోగ్యమా? నాకు ఎంతో మంది ఆడపిల్లలు నా రాజీల్లా కనిపించేరు.

ఆ రాత్రి నిద్రలేదు. మగత—మగత నిండా అర్థంలేని కలలు—దేశంలో ఆడపిల్లలందరూ హిస్టీరికల్‌గా కేకలు పెడ్తూ.

*  *  *

"ఈ రోజు శివరాం మనింటి కొస్తానన్నాడమ్మా" అన్నాను.

"అదేమన్నయ్యా ఈ సాయంత్రం పాపం ఎవరూ అతన్ని ఎంగేజ్ చెయ్యడం లేదా? లేకపోతే నేను చెయ్యాలా?" ఎంత తక్కున అనేస్తుందో లోపలి ఆలోచన అలా అనగలగడానికి ఎంత ధైర్యం కావాలి?

"ఎన్ని గుండెలు వాడికి?" అని నవ్వాను.

"నాకు ఒక గొప్ప వర్ణన గుర్తొస్తూ ఉంటుందన్నయ్యా! ఒక మదించిన ఏనుగు—ఏనుగు శరీరం నుంచి కారే మద జలానికి ఒక అద్భుతమైన సువాసన ఉంటుందటలే-ఆ ఏనుగు ఒక సరస్సులో స్నానం చేస్తోందట, ఆ మదజలం ఆ నీటి నిండా నిండిపోయిందట. ఆ సౌరభానికి వేలాది తుమ్మెదలు వచ్చి ఆ ఏనుగు మీద వాలిపోతున్నాయిట—మనిషికి ఆ జంతు ప్రవృత్తి రావచ్చా?"

నాకు మతి పోయింది. ఎంత కఠినంగా గుండెలో చాకు దించినట్టు చెప్తోంది.

మళ్ళీ తనే అంది "శివరాం మంచి పిల్లని ఏసుకుని పెళ్ళి చేసుకుంటే ఎంత బావుణ్ణో కదా! వెయ్యి రూపాయలతో అతను సుఖ జీవనం చెయ్యలేకపోవచ్చు. తృప్తి నిండిన జీవితం --సుఖ జీవితం కంటె ఎంత గొప్పది!"

"ఈ రోజు మనింట్లో డాన్స్ చేస్తాడట" సబ్‌జెక్ట్ మార్చాలనే మార్చేను.

"వద్దన్నయ్యా! మదాన్ని కళారూపాల్లోకి మార్చి విరజిమ్మడం నేను సహించలేను. మనం సినిమాకి పోదాం వచ్చేలోగా—"

*  *  *

రెండు రోజులయింది. రాజీ మొహం ప్రశాంతంగా ఉంది. ఆ 'స్ట్రింగ్స్' నా కళ్ళ ముందు మెదుల్తున్నాయి. ఎలా అడగను-? ఎలా మొదలు పెట్టను-?

మూర్తి రూంలోంచి సన్నగా ఆలాపన విన్పిస్తోంది ఇతని హమ్మింగ్ కూడా నన్నెక్కడికో తీసుకుపోతుంది. తీరా పిలిచి కూచోబెట్టి పాడమన్నానా? ఏ అనుభూతి కలగదు. పాడి తీరాలన్నట్టు పలికిస్తాడు.

నిశ్శబ్దంగా అలాగే ఉండి వింటున్నాను.


లోపల్నించి చెల్లి వచ్చింది. వచ్చి నా పక్కనే కూచుంది. కాసేపటికి నా భుజం మీద వాలిపోయిన తల. వెక్కి వెక్కి ఏడుపు. ఒళ్ళోకి తీసుకున్నాను.

"ఆయన్ని పాడవద్దను అన్నయ్యా. రెండు రోజులకొకసారి తిండి తినే వాళ్ళు పాడలేరు. పాడటానికి ఓపిక ఉండదు—" హిస్టీరికల్ అయిపోతూ ఏదేదో మాట్లాడేస్తుంది.

గబుక్కున మూర్తి బైటకి వచ్చాడు. చెల్లి స్పృహలో లేదు. కంగారు పడిపోయాడు.

"రండి లోపలికి తీసికెళ్ళి పడుకోబెట్టేద్దాం—" అంటూ ఇద్దరమూ కలిసి లోపలికి తీసికెళ్ళి పడుకోబెట్టాం.

నా దగ్గిర ఎమర్జెన్సీలో ఉంచిన మందులు వేశాను. కాసేపటికి ప్రశాంతంగా



నిద్రలోకి వెళ్ళిపోయింది.

మూర్తి గాబరా ఇంకా తగ్గలేదు.

"మాస్టారూ! ఇలా చూస్తూ ఊరుకుంటే ఎలాగండీ!"

అతన్నే పరీక్షగా చూస్తూ అనుకున్నాను.అవును చూస్తూనే ఊరుకుంటున్నాను- అని.

ఇతనికి ముప్ఫై ఏళ్ళు దాటిపోయేయి ఇంక ఉద్యోగం వస్తుందో రాదో తెలీదు. తండ్రి మిగిల్చిపోయిన ఈ పాత పెంకుటిల్లు నీనికి మేమిచ్చే అద్దె డబ్బులు. ఈ డబ్బు నెలరోజులూ భోజనానికి సరిపోతుందా?

పాట పాడుతూనో— హార్మోనికా ఊదుకుంటూనో— శూన్యంలోకి చూసే అతని కళ్ళనిండా ఎంత నిరాశ.

అతను మానసికంగా రోజురోజుకీ హిస్టీరికల్‌గా అయిపోతున్నాడు. ఆ అవస్థలోంచి వలికే సంగీతం గురించి అతనికి చెప్పాలని నేను ప్రయత్నించడం ఎంత అవివేకం! ఇతనికి సుఖజీవనం అక్కర్లేదు. పెళ్ళి చేసుకోగల స్తోమత లేదని తెలిసీ, అమ్మాయిలక్కర్లేదు. అమ్మాయిల్ని దగ్గర చేసే ఆర్ట్ ఉన్నట్టు కూడా గుర్తింపు లేదు.

ఇతని తంబురాతీగెలు తెగిపోయాయా?

* * *

ఈ ఇంట్లోకి వచ్చిన ఓ తెల్లవారుజామున హాయి అయినజ్ఞాపకంకదిల్చినట్టు ఎక్కడిదో పాట నన్ను లేపేసింది.

చెల్లి లేచి 'రేడియో పెట్టిందా? అని చూశాను. లేదు కానీ అదీ నాలానే లేచి ఆలోచిస్తోంది.

బాలమురళీ పాడే తత్వం అది. సాధారణంగా రేడియోతో సోమవారాలు వస్తూ ఉంటుంది. బాలమురళీ పాడుతున్నట్టు లేదు కాని చాలా హాయిగానే ఉంది. ముఖ్యంగా వెనక ఆ తంబురా శృతి నాకూ, చెల్లికీ ఆ శృతి ఎంత ఇష్టమో.

నా వేపు చూస్తోంది చెల్లి.

ఎక్కణ్ణుంచి-అన్నట్టు సైగ చేశాను.

పక్క వాటావైపు చూపించింది లేచి తల దువ్వుకుని, పెరటి తలుపు తీశాను తెల్లగా వెలుగురాలేదు. కాని చల్లనివెలుగు అస్తమయ వెన్నెల్లో తులసికోటని ఆనుకొని కూచుని పాడుతున్నాడు మూర్తి. పాతగిల్లినా నగిషీలు చెక్కు చెదరని తంబురా శృతి వేస్తూ.

అతని నగిషీలు సహజమైనవి. అతను అమ్మాయిల స్నేహం కోసం చెక్కుకున్నవి కావు- అని ఆ క్షణంలోనే తెలిసింది నాకు.

అతన్ని కదిపి మళ్ళీ పాడిస్తే- మామూలు మనిషై పోతాడనికూడా అప్పుడే తెలిసింది.

* * *

అవును. ఈ మధ్య తంబురా శృతించడం లేదు. నేను ఆ ధ్యాసలోనే లేను. చెల్లి అనారోగ్యం గొడవలో వుండిపోయాను. ఇప్పుడు చెల్లి బీరువాలో తీగలు గుర్తుచేసి— ఇంకెన్నో విషయాలు చెప్పాయి.

చెప్పాయికాని ఎలా సాల్వ్‌చెయ్యను?

డాక్టరు చెప్పిన తర్వాత చెల్లి పెళ్ళికి తీవ్ర ప్రయత్నాలు చేశాను. రకరకాల లోన్లు తీసుకోడానికి నిర్ణయించుకుని.

కాని 'నా హిస్టీరియా ఎవరి దగ్గర దాచకు' అని పెద్ద షరతు పెట్టింది.

ఇక నా చెల్లి కి పెళ్ళి చెయ్యగలనా? ఇప్పుడూ అదే సంకోచం అయినా సాహసించదల్చుకున్నాను. ఆ మధ్యాహ్నం ఆఫీస్‌కి లీవ్ పెట్టి ఇంటికి వచ్చేశాను. మూర్తి అలాగే— అదే— పద్ధతిలో ఉన్నాడు.



# ఆశల తరంగాలు

నా అందమైన బంగళాలో
నా ఆస్తినీ, అంతస్తునీ
చాటి చెప్పేవి ఎన్నో!
గోడలకున్న మోడరన్
వర్ణ చిత్రాలు.
కిటికీల తెరల అందాలూ.
ఇంటినిండా అందమైన ఫర్నిచరూ.
ఇంకా. ఎన్నో ఎన్నెన్నో!
కాని.
నా జీవితం నిరాశతో
నా హృదయం ఆవేదనతో
కొట్టు మిట్టాడుతున్నాయి
'ప్రేమ' అనే సముద్రంలో దిగిన
ఈత రాని వాడిలా!
ఆనందమనే ఒడ్డు చేరే ఆశతో-

—తరంగిణి

లోపల్నించి నాలో ఉత్సాహాన్ని నింపుతూ హార్మోనికా స్వరాల తెరలు. తాళం తీసి లోపలికివెళ్ళిమొహంకడుక్కున్నాను. పెరట్లోంచి పూర్తిగా విరిసిన ఒక బంతి పువ్వు కోసి తెచ్చాను. కాసేపు ఆ తీగల మీద పెట్టాను. తర్వాత తీసుకొని బైటికొచ్చి మూర్తి రూంలోకి వెళ్ళాను

మూర్తి లేచి కూచున్నాడు ఈ రోజు అతని మొహంలో ఏదో రిలీఫ్ కనిపిస్తున్నట్టుగా ఉంది. ఉద్యోగం వచ్చేసిందా ఒక వేళ?

"ఈ రోజు నా కోసమే త్వరగా వచ్చేశారా? ఉదయంనించి మిమ్మల్ని ఒక్క మాట అడగాలని వెయిట్ చేస్తున్నాను" అన్నాడు.

"వద్దు ఉండండి— ఒక్క నిమిషం తర్వాత చెప్పవచ్చు" అనిక్షణం ఆలస్యం చేస్తే ఏమైపోతుందో నన్నంత భయంతో "ఈ తీగలు ఆరునెలల్రకితం చెల్లి కొంది. బీరువాలో ఈ మధ్యే కనిపించాయి నాకు. తీగలు తెగిపోయిన తంబూరాని మొదట

తనే గుర్తించింది. కాని కొన్నా తర్వాత తనకి కలిగిన తన అవస్థ—వీటిని మీకు ఇష్టమయితే ఈ తీగలు తంబురాకి బిగించి ఈ బంతి పువ్వుని దానికి పెట్టండి" అని ఆ రెండూ అతని చేతిలో పెట్టేశాను.

అతను అవాక్కయి పోయాడు.

"మాస్టారూ! మీరు నమ్ముతారో లేదో! క్రితం క్షణంలోనే మిమ్మల్ని బావగారూ అని పిలవాలని ఉంది. అభ్యంతరం లేదు కదా! అని అడగాలనుకున్నాను. రాజీ గురించి అన్నీ నాకు తెలుసు. నన్ను గురించి ఆమెకూ తెలుసు. నా పాటలకి శృతి తంబురాలో లేదు." అంటున్నాడు.

అతని కళ్ళల్లో సన్నని నీటి పొర.

నా కళ్ళ నిండా నీళ్ళే. నీళ్ళ వెనక ఎన్నో చిత్రాలు. మూర్తి, చెల్లీ చెయ్యి చెయ్యీ పట్టుకుని నడుస్తున్నారు. ఆవెనక నిరుద్యోగులయిన అబ్బాయిలూ, పెళ్ళిళ్ళు కాని అమ్మాయిలూ—నాకు వాళ్ళగురించి బెంగవెయ్యడంలేదు. అందులో మూర్తులు, రాజీలు ఉండక మానరు.

ఆనందంలో నా కౌగిలిలో మూర్తి. ఆ రాత్రి కొంచెం ఆలస్యంగా ఇంటికిచేరేను మెట్ల మీద వెన్నెలబొమ్మలా రాజీకూచుని ఉంది. అరుగు మీద పడక కుర్చీలో పడు కుని మూర్తి తంబురా శృతి చేస్తూ పాడుతున్నాడు.

తీరెను కోరిక తీయ తీయగా
హాయిగ మనసులు తేలి పోవగా
కలిసి ప్రయాణం—కలదు వినోదం
కల ఫలించేను కమ్మ కమ్మగా—

నన్ను చూసి పాట ఆపేశాడు. ఇప్పటికి తట్టింది ఇదే పాట రోజూ మూర్తి హార్మోనికా మీద ఊదేవాడు. తెరలుతెరలుగా వచ్చి నన్ను కుదిపేశాడు— ఈ వేళ దాకా తెలీలేదు. అది ఈపాట అని. పదే పదే అలా వినిపిస్తూనే ఉంది. చిత్రం ఇప్పుడు మూర్తి పాడడం లేదు—మానేసి చాలా సేపయింది. రాజీ నా ఒళ్ళో వాలి ఉంది.

ఇంత హాయైన వెన్నెల్లో వాళ్ళిద్దరి ఆనందం నన్నా ఆ పాటగా తాకి మౌనంగా నాకు వినిపిస్తోంది.

*

## నిద్రపట్టని రాత్రి

నిద్రపట్టని ఈ రాత్రి
తగుల్తున్నాయి చురుక్కుమనే దెబ్బలు

కిటికీ తలుపు తీస్తే
శీతాఘాతం!
కేలండరుపై అమ్మాయి
వంపుల్ని చూస్తుంటే
విద్యుద్ఘాతం
ఆమెని గురించి ఆలోచనలు ముసిరితే
మన్మధుడి శరాఘాతం!
ఇవేవీ వద్దు
హాయిగా చదువుకుందామని
పక్కమీద చేరి
పుస్తకం తెరిస్తే
ఉపోద్ఘాతం!

— కాశీనాథ & కాశీనాథ


## విశాలాంధ్ర సాహిత్యం ఉత్తమాభిరుచికి సంకేతం

| | | |
|---|---|---|
| జీవోత్పత్తి కథ | ఏ. ఐ. ఒపారిన్ | 12-00 |
| రాకాసికోన | వీరవల్లి వీణావాణి | 12-00 |
| చంఘిజ్‌ఖాన్ | తెన్నేటి సూరి | 25-00 |
| కొడవటిగంటి కుటుంబరావు సాహిత్యం | మూడవ సంపుటం | 25-00 |
| కొడవటిగంటి కుటుంబరావు సాహిత్యం | ఐదవ సంపుటం | 30-00 |
| ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర | కంభంపాటి సత్యనారాయణ | 25-00 |
| ఆంధ్రుల సంక్షిప్త చరిత్ర | ఏటుకూరు బలరామమూర్తి | 12-00 |
| భారతీయ తత్వశాస్త్రం | ఏటుకూరు బలరామమూర్తి | 13-00 |
| భారతీయ తత్వశాస్త్రం సులభ పరిచయం | దేవీ ప్రసాద్ చటోపాధ్యాయ | 15-00 |
| అమృతం కురిసిన రాత్రి (రెండవ కూర్పు) | తిలక్ | 15-00 |
| 1 + 1 = 1 మొదలైన రేడియో నాటికలు | శ్రీశ్రీ | 10-00 |
| చరమ రాత్రి | శ్రీశ్రీ | 10-00 |
| మహాప్రస్థానం | శ్రీశ్రీ | 10-00 |
| ఖడ్గసృష్టి | శ్రీశ్రీ | 9-00 |
| పిల్లల మనస్తత్వశాస్త్రం (రెండవ కూర్పు) | ధూర్జటి సుబ్బారావు | 10-00 |
| వీరేశలింగం రచనలు | రెండవ సంపుటం | 20-00 |
| వీరేశలింగం రచనలు | మొదటి సంపుటం | 16-00 |
| మన చరిత్ర | ఏటుకూరు బలరామమూర్తి | 14 00 |

సుంకర స్మారక బహుమతి పొందిన నాటికలు

మహిళలే కళ్ళు తెరిసే టి. వాణీ రంగారావు 4-00 పద్మవ్యూహం ఎల్. బి. శ్రీరామ్ 4-00
విషాద భారతంలో మరో ఆడపడుచు గంజి రామారావు 4-00 వనితామేధం సుంకర కోటేశ్వరరావు 4-00

పోస్టేజి అదనం

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ : చంద్రం బిల్డింగ్స్, విజయవాడ-520 004

విశాలాంధ్ర బుక్ హౌస్ : విజయవాడ, విశాఖపట్టణం, హైదరాబాదు, గుంటూరు, తిరుపతి, అనంతపురం, హన్మకొండ.